క్లుప్తంగా

24న భూ సేకరణపై రైతులకు అవగాహన

బల్మూర్: అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఉమామహేశ్వర ప్రాజెక్టు భూ సేకరణపై పీసా యాక్టు 2011 ప్రకారం ఈ నెల 24న బల్మూర్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సూచన మేరకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని బల్మూర్, మైల్లారం, అనంతవరం గ్రామపంచాయతీల్లోని రైతులు హాజరు కావాలని కోరారు.

ఆశావర్కర్లకు మెడికల్ కిట్ల పంపిణీ

ఉప్పునుంతల: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు శుక్రవారం వైద్యాధికారులు స్వప్న, అభిలాష్ మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా తొలి దశలోనే గుర్తించి చికిత్సలు అందించడానికి ఈ మెడికల్ కిట్లు ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామాల్లో ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉంటూ.. చిన్నారుల్లో అంగవైకల్యం లక్షణాలు గుర్తిస్తే వెంటనే అవసరమైన చికిత్సలు చేయడంతో పాటు త మ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఉప్పల

కల్వకుర్తి రూరల్: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



పెద్దకొత్తపల్లి/చారకొండ: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈఓలు ముజీబ్, అనూష అన్నారు. పెద్దకొత్తపల్లి, చారకొండ మండలం మర్రిపల్లిలో శుక్రవారం రైతులతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వెయ్యి మంది రైతులకు గాను ఇప్పటి వరకు 250 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు చంద్రయ్య, రాజశేఖర్, సురేశ్, శేఖర్, రాంబాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



తిమ్మాజిపేట: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వ్యక్తిగత సమాచారం అందించవద్దని సూచించారు. ముఖ్యంగా బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, పిన్ నంబర్లు, ఓటీపీలు చెప్పవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లతో మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం



నాగర్‌కర్నూల్ రూరల్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి తీరని అన్యాయం చేస్తోందని అఖిలభారత భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు రత్నాకర్, రాజు ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ.. కార్మిక వర్గాన్ని శ్రమదోపిడీకి గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో 30లక్షల మందికి పైగా భవన నిర్మాణరంగ కార్మికులు ఉన్నారని.. ప్రభుత్వ నిర్మాణరంగ పనులను కాంట్రాక్టర్లకే కాకుండా భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రూ. 20లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, కార్మికులు ప్రమాదానికి గురైన నెల రోజుల్లో ప్రమాద బీమా విడుదలయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు గట్టు శ్రీను, నాయకులు రాములు, లక్ష్మీనారాయణ, పాండు, యాదయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం..

- ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవికుమార్



జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవికుమార్

నాగర్‌కర్నూల్ క్రైం/కొల్లాపూర్/అచ్చంపేట రూరల్/కల్వకుర్తి టౌన్/బిజినేపల్లి/లింగాల/ఉప్పునుంతల: డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవికుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. డెంగీ వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీతో పాటు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసులు, పెద్దముద్దునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వాణి, డీపీఓ రేణయ్య, డీపీఎంఓ సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

- కొల్లాపూర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో హెల్త్ ఆఫీసర్ రామ్మోహన్, సబ్‌యూనిట్ ఆఫీసర్ కిషోర్‌రావు, ఎంపీహెచ్‌ఈఓలు సాయిరెడ్డి, రమేశ్, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, దివాకర్, ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.
- డెంగీ లక్షణాలు, నివారణపై ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.తారాసింగ్ సూచించారు. అచ్చంపేటలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ప్రశాంత్, బిక్కులాల్, హనుమంతు పాల్గొన్నారు.
- శుభ్రతతోనే డెంగీని నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమా నాయక్ అన్నారు. కల్వకుర్తి క్లస్టర్ కార్యాలయం నుంచి చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం డెంగీ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.
- బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లిలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ డాక్టర్ టి.ప్రసన్న వివరించారు. డా.తేజస్విని, మేఘనారెడ్డి, సిబ్బంది బాలమణి, అబ్దుల్ సలీం, విజయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.
- లింగాల మండలం అంబట్‌పల్లిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యులు జయచంద్ర, దశరథం, హెచ్‌ఎస్ రాంచందర్, హెల్త్ అసిస్టెంట్ మల్లేష్, ఏఎన్‌ఎంలు సుజాత, పద్మ ఉన్నారు.
- ఉప్పునుంతల మండల కేంద్రంలో డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వప్న, అభిలాష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, ఫార్మసిస్టు కుమారాచారి, సిబ్బంది ఉఫత్ పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్



అచ్చంపేటలో..



లింగాల మండలం అంబట్‌పల్లిలో..

సేంద్రియ వ్యవసాయం.. లాభదాయకం



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

కల్వకుర్తి టౌన్: సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభం చేకూరుతుందని వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు డా.జ్యోతి, అరుణకుమారి అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీలోని సిలార్‌పల్లి వార్డులో రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. పంటల దిగుబడి కోసం చాలా మంది రైతులు రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం సరికాదన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని సూచించారు. అదే విధంగా భూగర్భ జలాలను పూర్తిగా తోడేస్తే.. పంట చేతికొచ్చే సమయంలో సరిపడా నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంటుందని వివరించారు. వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా పొలంలోనే కలియ దున్నాలని.. తద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం రైతులు సేంద్రియ వ్యవసాయంలో పాటించాల్సిన సూచనలను తెలియజేశారు. కార్యక్రమంలో యువ శాస్త్రవేత్తలు, ఏఈఓలు చందన, ప్రియాంక, సతీష్ పాల్గొన్నారు.

చెంచుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: చెంచుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి.. బృహత్తర పథకాలకు శ్రీకారం చుడుతోందని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజాభవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములు పొందిన చెంచుల కోసం రూ. 12,600కోట్లతో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ఈ నెల 18న అమ్రాబాద్ మండలం మాచారంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. అదే విధంగా చెంచులకు పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మాచారంలో నిర్వహించే సీఎం బహిరంగ సభకు భారీ జన సమీకరణ చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రతి గ్రామం, వార్డుల నుంచి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గౌరీశంకర్, సోమ్లానాయక్, పట్టణ అధ్యక్షుడు కటకం రఘురాం, మాజీ ఎంపీపీ రామనాథం, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ రామేశ్వర్

బిజినేపల్లి: పాఠశాల స్థాయిలోనే ప్రతి విద్యార్థికి సామాజిక స్థితిగతులను వివరించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం బిజినేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇంటి, పాఠశాల వాతావరణానికే అలవాటుపడి ఉంటారని.. వారికి బాహ్య ప్రపంచం గురించి, అందులోని అంశాలను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కౌమార దశలోని విద్యార్థులకు పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదే విధంగా క్రీడల్లో ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్షణికావేశంలో నేరాలకు పాల్పడొద్దు



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

నాగర్‌కర్నూల్ క్రైం: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి నేరస్తులుగా మారి కుటుంబ సభ్యులకు దూరం కావొద్దని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సబ్‌జైలును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ ఎవరైనా ఆర్థిక స్తోమత లేనివారు ఉన్నట్లయితే వారికి న్యాయ సేవాధికార సంస్థ తరఫున ఉచితంగా ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామన్నారు. తాగిన మైకంలో తల్లిదండ్రులు, భార్య, అన్నదమ్ముల పట్ల విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ ప్రశాంత జీవితం కొనసాగించాలన్నారు. ఎవరైనా నేరం చేసి ఒకసారి జైలుకు పోయినట్లయితే సమాజం వారి పట్ల చిన్నచూపు చూస్తుందని, చాలా సందర్భాల్లో మైనర్లను ప్రేమించి పోక్సో కేసులో జైలుకు వస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులు, తోటి వారితో సత్ప్రవర్తనతో మెలిగితే వారి ఆదరాభిమానాలు మనకు లభిస్తాయని చెప్పారు. అనంతరం జైలు పరిసరాలు, వాష్ రూంలు, వంటగదిని పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. ఖైదీలకు కల్పిస్తున్న వసతులు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



కోడేరు: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తీగలపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న కొనుగోలు కేంద్రాలు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. ఫలితంగా అకాల వర్షాలకు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దవుతుందని అన్నారు. అదే విధంగా 40 కిలోల బస్తాకు ఎక్కువగా తూకం వేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని వారు తహసీల్దార్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకుపోవడంతో.. ఆయన అక్కడికి చేరుకొని తూకంలో తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రాములు, దామోదర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



అచ్చంపేట రూరల్: మండలంలోని పులిజాలలో శుక్రవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆంజనేయ స్వామి, శివాలయంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాలు, ధ్వజస్తంభం, బొడ్రాయి (నాభిశిల), పోచమ్మ, ముత్యాలమ్మ, కోట మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ, ఋత్విక్‌వరణం, దీక్షధారణ, అఖండదీప స్థాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బొడ్రాయి (నాభిశిల) విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మన్ననూర్: జోగుళాంబ గద్వాల జిల్లాలోని నల్లకుంటలో ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి జక్క బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ నియంతగా పాలన కొనసాగిస్తుందన్నారు. మానవ హక్కులను హరించడం ఆపడంతో పాటు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మహాసభలకు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు, సామాజిక వేత్తలు, కార్మికులు, కర్షకులు, విద్యావేత్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



లింగారెడ్డిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ ఈశ్వర్‌జీ

వెల్దండ: నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఏపీఓ ఈశ్వర్‌జీ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగారెడ్డిపల్లిలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభించే వనమహోత్సవానికి అన్నిరకాల మొక్కలను సిద్ధం చేయాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు అందుబాటులో ఉండాలన్నారు. ఎండ తీవ్రతకు మొక్కలు ఎండిపోతే తిరిగి ఖాళీ బెడ్లలో విత్తనాలు విత్తాలని సూచించారు. నర్సరీలో రైతులకు ఉపయోగపడే మొక్కలతో పాటు పూల మొక్కలు, అలంకరణ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏపీఓ వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు ఉన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వెల్దండ: గ్రామీణ యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుప్పగండ్లలో ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడా నైపుణ్యం ఉన్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేతలకు మొదటి బహుమతి రూ. 20వేలు, ద్వితీయ బహుమతి రూ. 10వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జల్లెల అశోక్, దశరథం, విష్ణు, మహేశ్, శ్రావణ్, కిరణ్, రామకృష్ణ, రియాజ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సంగప్ప

తాడూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ పీడీ సంగప్ప అన్నారు. శుక్రవారం తాడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకుంటేనే బిల్లులు వస్తాయన్నారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదే విధంగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ రాజవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

'ఒకేషనల్ కోర్సుల తొలగింపు సరికాదు'



మాట్లాడుతున్న శివశంకర్

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలో ఒకేషనల్ కోర్సులను రద్దు చేయడం సరికాదని జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సులను దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు అన్ని గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో స్వేరోస్ నాయకులు ధర్మరాజు, రాము, శివశంకర్, రామస్వామి, శంకర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిమ్మాజిపేట: మగ్గం వర్క్‌లో 45 రోజులపాటు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధిలో రాణించి.. ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని బ్యాంకర్ల గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాగరాజు, ఏడీఎం భాస్కర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు గొరిట, మారేపల్లి గ్రామాలకు చెందిన మహిళలు మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకోగా.. శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకర్ల గ్రామీణ అభివృద్ధి సంస్థ తరఫున పేద మహిళలను స్వయం ఉపాధిలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మగ్గం వర్క్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు సెంటర్లను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సత్తయ్య పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య



బల్మూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి
- బడిబాట కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు



వెల్దండ మండలం కొట్రలో..

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని.. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ బడులతో కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రఘు పాల్గొన్నారు.

- ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఎంఈఓ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెద్దకొత్తపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 6–14 ఏళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ ఈశ్వర్ పాల్గొన్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ ఝాన్సీరాణి కోరారు. చారకొండ మండలం జూపల్లిలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మస్న అంజయ్య ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.
- బల్మూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.
- లింగాల మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లిలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడంతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ బషీర్ అహ్మద్, జీహెచ్‌ఎం జ్యోతిరాణి పాల్గొన్నారు.
- తాడూరు మండలం అల్లాపూర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించి.. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు.
- వెల్దండ మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.